క్లుప్తంగా

విఘ్నేశ్వరుని దర్శించిన సాయికుమార్



విఘ్నేశ్వరుని సన్నిధిలో సినీనటుడు సాయికుమార్

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామివారిని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ గుత్తుల నాగబాబు, వేద పండితులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం సాయికుమార్‌ను పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను చైర్మన్ నాగబాబు అందజేశారు. ఆలయ చరిత్రను వేద పండితులు వివరించారు. 'అందరూ బాగుండాలి.. అందులో నేనుండాలి' అంటూ స్వామివారిని కోరుకున్నానని సాయికుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

అంబాజీపేట: తనపై తప్పుడు ప్రచారం చేశారనే మనస్తాపంతో ఒక యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గంగలకుర్రు అగ్రహారం శివారు ప్రసాద్ నగర్ కాలనీకి చెందిన చోడే వెంకట శ్రీహరి, స్థానికంగా ఒక మహిళతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడంటూ అదే కాలనీకి చెందిన పెదపూడి కిరణ్, నేదునూరి సిద్ధు ప్రచారం చేస్తున్నారు. వారితో పాటు మండలంలోని నందంపూడికి చెందిన మరో యువకుడు తులసీరాం కూడా శ్రీహరిని నానా దుర్భాషలాడాడు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన శ్రీహరి.. తన తల్లి వినియోగించే 10 మాత్రలు నీటిలో కలిపి తాగాడు. అపస్మారస్థితికి చేరుకున్న శ్రీహరిని 108లో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. శ్రీహరి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎ.చైతన్య కుమార్ తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో సోమవారం ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ జరిగింది. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో ఆయా పీహెచ్‌సీల అధికారులు మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన సుమారు 5 వేల మంది లబ్ధిదారులకు ఈ కార్డులు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ కార్డులపై ప్రతి ఒక్కరూ రూ.5 లక్షల వరకూ నిర్దేశిత కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందవచ్చని తెలిపారు.

వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీదే గెలుపు

రావులపాలెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కూడా బీజేపీ గతంలో కంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందని, వరుసగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని అవుతారని, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పొనుగుపాటి శ్రీనివాస్ అన్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే దీనికి నిదర్శనమని చెప్పారు. రావులపాలెంలో సోమవారం ఆయన మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో దేశ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. దేశ ప్రజల ఆర్థికాభివృద్ధి, దేశ భద్రతకు ఆయన తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలు ఇచ్చాయని చెప్పారు.

సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగన్ రావాలి

ఉప్పలగుప్తం: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ అన్నారు. మండలంలోని వానపల్లిపాలెం, మునిపల్లి సచివాలయం పరిధిలో ఆయన అధ్యక్షతన సోమవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి సచివాలయ పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో కూడిన బోర్డును ప్రారంభించారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రూ.14,85,36,491, నాన్ డీబీటీ ద్వారా రూ.4,49,49,922 లబ్ధి చేకూరిందని జేసీఎస్ మండల కన్వీనర్ కోటం లోవరాజు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు నల్లా నాయుడు, సచివాలయ కన్వీనర్ నల్లా సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల శతజయంత్యుత్సవం

తాళ్లరేవు: మండలంలోని పి.మల్లవరం ధూళిపూడి గొల్లబాబు కల్యాణ మండపంలో ఘంటసాల శతజయంత్యుత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. న్యూఢిల్లీకి చెందిన ఆదిలీల ఫౌండేషన్, ఎన్టీఆర్, ఏఎన్ఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షుడు ఉంగరాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన గానావధానం, సంగీత విభావరి జరిగాయి. అవధానంలో పది మంది కళాకారులు ప్రశ్నలు వేయగా డాక్టర్ రెహంతుల్లా ఒకేసారి పది ప్రశ్నలకూ జవాబులు చెప్పి ఆహూతులను ఆశ్చర్యచకితులను చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో స్థానికులు సైతం పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో ఆదిలీల ఫౌండేషన్ చైర్మన్ ఎస్.ఆదినారాయణ, తనికెళ్ల పార్థసారథి, కారక రాజబాబు, కనక రత్నమాల, ఆకుల శ్రీనివాస్, కామన ప్రభాకర రావు, పుల్లెపు వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



మలికిపురం మండలం గొల్లపాలెం వద్ద కల్లోలంగా ఉన్న కడలి



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో నిలిచి ఉన్న బోట్లు



మామిడికుదురులో ధాన్యం రాశి చుట్టూ చేరిన ముంపు నీరు



ఆలమూరులో మూతపడిన ఇటుక బట్టీ

అన్నదాత గుండెల్లో తుపాను

- 'మిచాంగ్' ప్రభావం.. ఎడతెరిపి లేని వర్షం
- స్తంభించిన జనజీవనం
- నేల కొరిగిన వరి చేలు
- రైతులను నిండా ముంచిన విపత్తు
- కదిలిన ప్రభుత్వ యంత్రాంగం
- ముమ్మరంగా పునరావాస చర్యలు

అన్నదాతల గుండెల్లో ఆందోళనల తుపాను రేగుతోంది. 'మిచాంగ్' తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు చేతికి అంది వచ్చిన పంట నేలకొరిగి.. నీట మునగడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న భారత వాతావరణ శాఖ హెచ్చరికలు వారిని మరింత కలవరపెడుతున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన తీసుకుంటున్న చర్యలు మునుపెన్నడూ లేనంత ఊరటనిస్తున్నాయి. తుపాను ప్రభావంపై ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు చేపడుతోంది.



అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామంలో నేలనంటిన వరి చేలు

మామిడికుదురు: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో మామిడికుదురు మండలంలో సోమవారం జనజీవనం స్తంభించిపోయింది. ఈ వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని కలిగించాయి. మామిడికుదురు, నగరం, గెద్దాడ, పాశర్లపూడి, పెదపట్నం తదితర గ్రామాల్లో భారీ వర్షానికి కంకులు బరువెక్కి వరి చేలు నేలకొరిగిపోయాయని రైతులు వాపోతున్నారు. చేతికి అంది వచ్చిన పంట కోత దశలో తమకు దక్కకుండా పోతోందని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పలు గ్రామాల్లో నూర్పిడి చేసిన ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయింది. ధాన్యం రాశుల చుట్టూ వర్షపు నీరు చేరడంతో ధాన్యం మొత్తం పాడైపోతుందని వాపోతున్నారు. సముద్ర తీరంలోని కరవాక, గోగన్నమఠం గ్రామాల్లో రెండు సహాయ పునరావాస కేంద్రాలు, వాటిల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. తాగునీటితో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా రెండు కేంద్రాల్లోనూ రెండు జనరేటర్లు ఏర్పాటు చేశారు. రెండు గ్రామాల్లోనూ తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ సోమవారం పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. ఈఓ పీఆర్డీ తోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు పీవీఎస్వీ ప్రసాద్, వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారులు రెండు పునరావాస కేంద్రాల వద్ద ఉండి తుపాను పరిస్థితిని సమీక్షిస్తున్నారు. పునరావాస చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

స్తంభించిన జనజీవనం

పి.గన్నవరం: భారీ వర్షాలకు పి.గన్నవరం మండలంలో జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు చాలా వరకూ ఇళ్లకే పరిమితమయ్యారు. పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లోని కాలనీలను వర్షపు నీరు చుట్టుముట్టింది. మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో వరి చేలు నేలకొరిగాయి. మండలవ్యాప్తంగా 6,058 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేశారు. వీటిలో 2,200 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. దీనిలో ఇప్పటి వరకూ 2,915 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. సుమారు 600 మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లో ఉంది. వర్షం తగ్గిన వెంటనే ఆ ధాన్యాన్ని కూడా సేకరిస్తామని మండల వ్యవసాయ అధికారి కల్యాణ్ కుమార్ తెలిపారు. తుపాను నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆఫ్‌లైన్ విధానంలో కూడా రైతుల నుంచి 465 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, హుటాహుటిన మిల్లులకు తరలించామని చెప్పారు.



మామిడికుదురులో భారీ వర్షానికి నేలకొరిగిన వరి పైరు



పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో నేలకొరిగిన వరి చేలు

ఎడతెరిపి లేకుండా..

అంబాజీపేట: మండలంలో ఆదివారం రాత్రి నుంచీ ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. చిరు వ్యాపారులు, ప్రజలు నానా ఇబ్బందులూ పడ్డారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం, ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణం నీట మునిగాయి. చిరతపూడి శివారు చిట్టి చెరువు గట్టు వద్ద ప్రధాన రోడ్డుపై చెట్టు నేలకొరిగింది. కోతకు వచ్చిన వరి చేలు నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 3,016 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా ఇప్పటి వరకూ 400 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్ కుమార్ తెలిపారు. ఈదురు గాలులకు 247 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది.



అంబాజీపేట మండలం చిరతపూడిలో నేలకొరిగిన చెట్టు

అప్రమత్తంగా ప్రభుత్వ యంత్రాంగం

మలికిపురం: రాజోలు దీవిలో సోమవారం తెల్లవారుజాము నుంచీ ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో సాధారణ జనజీవనానికి తీవ్ర అంతరాయం కలిగింది. తీవ్రంగా ముసురు వేయడంతో ఆక్సిజన్ కొరత ఏర్పడి రొయ్యల రైతులు అవస్థలు పడుతున్నారు. సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. మత్స్యకారులతో పాటు రైతులు కూడా సముద్రం వద్దకు వెళ్లకుండా రెవెన్యూ యంత్రాంగం కట్టడి చేసింది. మలికిపురం మండలంలోని కేశనపల్లి, తూర్పుపాలెం, పడమటిపాలెం గ్రామాల్లో మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తహసీల్దార్ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. తీర గ్రామాల్లో రెవెన్యూ యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉంచామని చెప్పారు.

నిలిచిన బోట్లు

సఖినేటిపల్లి: అంతర్వేది వద్ద సముద్ర తీరం వెంబడి ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. అంతర్వేది బీచ్, సాగర సంగమం వద్ద కెరటాలు సాధారణ స్థాయి కంటే ఎత్తుకు ఎగసిపడుతూండటంతో తీరానికి ఉప్పునీరు పోటెత్తుతోంది. సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం, అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూండటంతో జనజీవనం స్తంభించిపోయింది. తుపాను నేపథ్యంలో మత్స్యకారులు పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో వందలాది బోట్లను లంగరు వేసి నిలిపివేశారు.

కుండపోత

రావులపాలెం: కుండపోత వర్షంతో రావులపాలెం మండలంలో ప్రజలు, చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. సాయంత్రానికి వర్షం కాస్త తగ్గడంతో ఉపశమనం కలిగింది. అయితే తుపాను ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది.

భారీ వర్షంతో ఇబ్బందులు

ఆలమూరు: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులతో మండలంలోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులు దాదాపు నిర్మానుష్యమయ్యాయి. వివిధ గ్రామాల్లో రహదారుల పైనే వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాల ధాటికి రహదారులు ఛిద్రమవుతున్నాయి. ఈ వర్షాలకు వ్యవసాయ, భవన నిర్మాణ, ఇటుక బట్టీల కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇప్పటికే మండలంలో సుమారు 90 శాతం మంది రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవడం కొంత ఊరటనిస్తోంది. అయితే, ఆలస్యంగా ఖరీఫ్ పనులు చేపట్టి, ఇప్పుడే మాసూళ్లు చేపట్టిన మరికొంత మంది రైతులకు ఈ తుపానుతో ఇబ్బందులు తప్పలేదు. ఆరుబయట కళ్లాల్లో ఉండిపోయిన ధాన్యాన్ని బరకాలు కప్పి రక్షించుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు.

నేలనంటిన వరిచేలు

అయినవిల్లి: ఈదురు గాలులు, భారీ వర్షాల ధాటికి మండలంలోని పలు గ్రామాల్లో వరి చేలు నేలనంటాయి. నల్లచెరువు, అయినవిల్లి, మాగాం, సిరిపల్లి, విలస, నేదునూరు, వెలువలపల్లి, మడుపల్లి తదితర గ్రామాల్లోని వరి చేలు నేలనంటడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. కొంత మంది రైతులు వరి పంటను యంత్రాలతో కోసి ధాన్యాన్ని గట్ల పైకి చేర్చి, టార్పాలిన్లు కప్పి రక్షించుకున్నారు. పలుచోట్ల ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి.

అప్రమత్తం చేస్తున్న అధికారులు

రాజోలు: మండలంలోని శివకోడు 18 ఎకరాల కాలనీ, పొన్నమండ, పొదలాడ గ్రామాల్లోని పలు కాలనీలను వర్షపు నీరు చుట్టుముట్టింది. లోతట్టు ప్రాంతాల్లో తుపాను పరిస్థితులపై క్షేత్ర స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు అన్నారు. మండలంలోని కాట్రేనిపాడులంక, మెరకపాలెం, పొన్నమండ శివారు, కడలి, చెన్నడం ప్రాంతాల్లో ప్రజలకు తుపాను తీవ్రతను వివరించారు. గోదావరిలో వేటకు వెళ్లరాదని రాజోలు మధ్య లంక, నున్నవారి బాడవ, మేకలపాలెం ప్రాంతాల్లోని మత్స్యకారులకు సూచించారు. తాటిపాక పీహెచ్‌సీ పరిధిలో ముంపు ప్రాంతాలను గుర్తించి పారిశుధ్య చర్యలు చేపట్టామని వైద్యాధికారి సీహెచ్ ఫణికిరణ్ తెలిపారు. గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిందిగా సూచించామన్నారు. సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లోని తీర ప్రాంతాల్లో సహాయక చర్యలు అందించేందుకు పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉన్నారని రాజోలు సీఐ గోవిందరాజు తెలిపారు. అంతర్వేది, అంతర్వేదికర, కేశవదాసుపాలెం, తూర్పుపాలెం, కేశనపల్లి, కరవాక ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు.

జోరు వానలోనూ.. 'జైజై శంకర'

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- పరమేశ్వరునికి అభిషేకాలు, లక్ష బిల్వార్చనలు, ప్రత్యేక పూజలు

పవిత్ర కార్తిక మాసం.. మూడో సోమవారం.. వేకువన నిద్ర లేచేసరికే చాలాచోట్ల భారీగా వర్షం.. అయినప్పటికీ ఎగసిన భక్తి తరంగాల ముందు జోరువాన సైతం చిన్నబోయింది. వేకువనే పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు.. అధిక సంఖ్యలో శివాలయాలకు వెళ్లి, దీపారాధనలు చేశారు.. శివయ్యకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లక్ష బిల్వార్చనలు నిర్వహించారు. 'హరహర మహాదేవ.. శంభోశంకర' అంటూ భక్తులు చేసిన హర నామోచ్చారణతో శైవ క్షేత్రాలు ప్రతిధ్వనించాయి.

కొత్తపేట: మండలంలోని పలివెల గ్రామంలో పురాణ ప్రసిద్ధి చెందిన ఉమా కొప్పేశ్వరస్వామి వారి క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకుని స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అత్యధిక సంఖ్యలో తరలి వచ్చి, స్వామివారి దర్శనానికి బారులు తీరారు. దేవస్థానం చైర్మన్ భమిడిపాటి దుర్గాలక్ష్మీనారాయణ ఆధ్వర్యాన అధికారులు, సిబ్బంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కొత్తపేట కాంతి భారతి విద్యా సంస్థల కరస్పాండెంట్ టి.సత్యవాణి పర్యవేక్షణలో విద్యార్థులు, భక్తులు వలంటీర్లుగా సేవలందించారు. కొత్తపేట హరిహర దేవాలయం, మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి ఆలయం, వాడపాలెం, వానపల్లి, బిళ్లకుర్రు, మోడేకుర్రు, అవిడి, ఖండ్రిగ, గంటి గ్రామాల్లోని శివాలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పలువురు 'ఉమా కేదారేశ్వరస్వామి నోము' ఆచరించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం: ర్యాలి శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి, శ్రీ జగన్మోహినీ కేశవస్వామి, ఆత్రేయపురం శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత రాజరాజేశ్వర స్వామి, వాడపల్లి అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయాలతో పాటు మండలంలోని పలు శివాలయాల్లో భక్తులు కార్తిక పూజలు, దీపారాధనలు ఘనంగా నిర్వహించారు. ర్యాలి, వెలిచేరు గ్రామాల్లోని అయ్యప్ప స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయ్యప్ప మాలధారులు అయ్యప్ప శరణ ఘోషతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ర్యాలి గ్రామంలోని వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద భారీగా అన్నదానం చేశారు.



పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి వారికి అభిషేకం చేస్తున్న వేదపండితులు



పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మార్మోగిన శివ నామస్మరణ

ఆలమూరు: మండలంలో ప్రసిద్ధి చెందిన పెనికేరు శ్రీ ఇష్టకాంతేశ్వరస్వామి, ఆలమూరు శ్రీ విక్రమ భట్టీశ్వరస్వామి, నర్సిపూడి, మడికి గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ బాలాత్రిపురసుందరీ సమేత సోమేశ్వరస్వామి, మూలస్థానం అగ్రహారంలో శ్రీ మూలేశ్వరస్వామి, చొప్పెల్లలో శ్రీ మల్లేశ్వరస్వామి, చింతలూరు శ్రీ పృథ్వీశ్వరస్వామి ఆలయాలతో పాటు వివిధ శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్తిక దీపాలు వెలిగించి, ప్రత్యేక అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు.

కిక్కిరిసిన ఆలయాలు

రావులపాలెం: మండలంలోని ఊబలంక సర్వమంగళా సమేత ఉమా మహేశ్వరస్వామి, రావులపాలెం పార్వతీ రామలింగేశ్వరస్వామి, కొమరరాజులంక, ముమ్మిడివరప్పాడు, వెదిరేశ్వరం, గోపాలపురం, ఈతకోట, రావులపాడు తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఉదయం శివయ్యకు అభిషేకాలు, ప్రత్యేక పూజలతో పాటు పార్వతీ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

వైభవంగా లక్ష బిల్వార్చనలు

మామిడికుదురు/అంబాజీపేట: మామిడికుదురు మండలం పెదపట్నంలంక శ్రీ ఉమా సత్యలింగేశ్వరస్వామి ఆలయంలో గ్రామ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యాన, పెదపట్నంలో గ్రామ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన లక్ష బిల్వార్చనలు వైభవంగా నిర్వహించారు. పలువురు భక్త దంపతులు కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. అర్చకులు విఘ్నేశ్వర పూజ, ఈశ్వరునికి పంచామృతాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు వేద మంత్రాలతో నిర్వహించారు. పార్వతీ దేవికి లక్ష కుంకుమార్చనలు చేశారు. అనంతరం సూర్య నమస్కారాలు, చండీ హోమం, రుద్ర హోమం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా జరిపించారు.



పెదపట్నంలంకలో లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

అంబాజీపేట మండలం మాచవరంలో శ్రీ కందుల మల్లేశ్వరస్వామి, వ్యాఘ్రేశ్వరంలో శ్రీ వ్యాఘ్రేశ్వర స్వామి, గంగలకుర్రు అగ్రహారంలో శ్రీ ఉమా పార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామి వార్లకు లక్ష బిల్వార్చనలు, ప్రత్యేకాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. మాచవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, కె.పెదపూడి, గంగలకుర్రు, నందంపూడి, ఇరుసుమండ తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

ఘనంగా కార్తిక పూజలు

పి.గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధిక సంఖ్యలో శివాలయాలకు వెళ్లి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్తిక దీపాలు వెలిగించారు. పి.గన్నవరం గరుడేశ్వరాలయంలో అర్చకుడు పూజ్యం మార్తాండ నారాయణ ఆధ్వర్యాన శివయ్యకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అయినవిల్లి: స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, ముక్తేశ్వరం ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి, నేదునూరు సర్వమంగళా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి వారి ఆలయంతో పాటు మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పలుచోట్ల సాయంత్రం జ్యోతిర్లింగార్చన చేశారు.

తరలివచ్చిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి, నీలకంఠేశ్వరస్వామి, మోరి సీతారామలింగేశ్వరస్వామి, గుడిమూల కృతకృత్య రామలింగేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేయడంతో పాటు శివాలయాల్లో నందీశ్వరుడు, జమ్మి చెట్టు, ధ్వజస్తంభాల వద్ద, లక్ష్మీ నృసింహుని ఆలయంలో వేప చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. అంతర్వేది లక్ష్మీనృసింహ స్వామి వారిని ఇంగ్లండ్ దేశస్తులు దర్శించుకున్నారు. ఆలయం నిర్మాణం చాలా బాగుందని అన్నారు.



అంబాజీపేట మండలం మాచవరంలో పూజలందుకున్న కందుల మల్లేశ్వర స్వామి



ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



ఆలమూరులో అలంకార భూషితుడైన శ్రీ పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి

కొబ్బరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రంలో కొబ్బరి తూకం వేయిస్తున్న రవీదేవి, సుధాకరరావు

కొత్తపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) యార్డులో ఏర్పాటు చేసిన నాఫెడ్ – ఆయిల్‌ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని కమిటీ చైర్‌పర్సన్ రెడ్డి రవీదేవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొబ్బరి రైతులకు ఆమె విజ్ఞప్తి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతు పక్షపాతిగా పని చేస్తోందని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అంటూ అని చిన్నచూపు చూస్తే.. నేటి సీఎం జగన్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ వ్యవసాయాన్ని పండగ చేశారన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బ తింటే రైతులు నష్టపోకుండా ఒకపక్క ఉచిత పంటల బీమా, మరోపక్క ఇన్‌పుట్ సబ్సిడీ అమలు చేస్తూ ఆర్థికంగా ఆదుకుంటోందని గుర్తు చేశారు. కొబ్బరి దిగుబడి తగ్గిపోయి, తగిన ధర లేక కోనసీమ రైతులు నష్టపోతున్న విషయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, కొబ్బరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. రైతులందరూ నిబంధనలు పాటిస్తూ కొబ్బరి విక్రయించడం ద్వారా తగిన గిట్టుబాటు ధర పొందాలని రవీదేవి సూచించారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ కో ఆర్డినేటర్ యు.సుధాకరరావు కొనుగోలు కేంద్రంలో కొబ్బరి విక్రయించే రైతుల అర్హతలు, నియమ నిబంధనలను వివరించారు. అనంతరం పలువురు రైతులు తీసుకువచ్చిన కొబ్బరిని కొనుగోలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ సెక్రటరీ వి.యశ్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.